క్లుప్తంగా

రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రకటించాలి

నందిపేట్ (ఆర్మూర్): సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న అన్ని రకాల ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే పదవీ విరమణ ప్రోత్సాహకంగా రూ.20 లక్షలు ప్రకటించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజు డిమాండ్ చేశారు. 61 సంవత్సరాలు వయసు నిండిన సమగ్ర శిక్ష ఉద్యోగులను 2024–25 సంవత్సరానికి విధుల్లోకి తీసుకోవద్దని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ మల్లయ్య బట్టు ఉత్తర్వులు జారీ చేయడం మమ్మల్ని తీవ్రంగా బాధించిందని, 20 సంవత్సరాలు పైగా విద్యాశాఖలోని సమగ్ర శిక్ష కార్యకలాపాలు జిల్లా కార్యాలయం నుంచి మొదలుకొని మండల విద్యా వనరుల కేంద్రం, భవిత కేంద్రం, కాంప్లెక్స్ పరిధిలో, పాఠశాల స్థాయిలో, కేజీబీవీలలో అనేకమంది ఉద్యోగులు అతి తక్కువ వేతనాలకే విధులు నిర్వర్తిస్తున్నందున వారిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వానికి కోరారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



నవీపేట: మండల కేంద్రంలోని ఎరువు లు, విత్తనాల దుకాణాలను మండల స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందం అధికారు లు గురువారం తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని దుకాణ యజమానులను హెచ్చరించారు. క్రయ విక్రయ రికార్డులను తనిఖీ చేశారు. ఈ బృందంలో తహసీల్దార్ నారాయణ, ఎస్సై యాదగిరిగౌడ్, ఏవో సురేష్‌గౌడ్‌లు ఉన్నారు.

కోటగిరిలో ప్రైవేటు ఆస్పత్రి..



రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రిని పీహెచ్‌సీ డాక్టర్ కరణ్, హెచ్‌ఈవో గోవర్ధన్ గురువారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సౌకర్యాలు పరిశీలించారు. పని చేస్తున్న సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. వారితో పాటు హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ శ్రీదేవి, ఆశావర్కర్ అనిత ఉన్నారు.

నిధులు మంజూరు చేయండి



ఆర్మూర్: నియోజకవర్గంతో పాటు జిల్లాలో నిలిచిపోయిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు గోర్త రాజేందర్ కోరారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం హైదరాబాద్‌లోని సీఎం కార్యాలయంలో గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 పార్లమెంట్ స్థానాలు సాధించడంలో కాంగ్రెస్ కార్యకర్తల పాత్ర క్రియాశీలంగా ఉందని వివరించారు.

ఆలయ భూములకు వేలం పాట



రెంజల్(బోధన్): నీలా గ్రామంలోని నీలకంఠేశ్వరాలయం ఆలయ భూములకు గురువారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు వేలం పాట నిర్వహించారు. గ్రామంలోని ఆలయానికి చెందిన 16 ఎకరాల భూమికి వానాకాలం సీజన్‌కు సంబంధించి పంచాయతీ కార్యాలయంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కమల బహిరంగ వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతు రూ.లక్షా 60 వేల 700లకు భూమిని దక్కించుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ ఉత్సవాలు



బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల్లో పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం ఉపాధి హామీ కూలీలు పర్యావరణ పరిరక్షణ ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి రక్షించాలని ఉపాధి హామీ పథకం పనుల వద్ద ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా క్రీడా ప్రాంగణాలు

- గ్రామ పంచాయతీలకు పట్టింపు లేక నిరుపయోగంగా ఉన్న వైనం
- నిధులు మొత్తం వృథా అనే వాదన
- క్రీడా ప్రాంగణాలను సమర్థవంతంగా నిర్వహించాలని యువత వినతి



ఏర్గట్లలో ఆలనా పాలన లేకుండా ఉన్న క్రీడా ప్రాంగణం

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణం గ్రామానికి దూరంగా ఏర్పాటు చేశారు. అక్కడ సరైన రక్షణ చర్యలు లేవు. క్రీడా సామగ్రి ఎక్కడ పెట్టాలో తెలియక ప్రాంగణాన్ని వృథాగా వదలివేశారు. వినియోగంలో లేకపోవడంతో గడ్డి మొలిచి అస్తవ్యస్తంగా తయారైంది. ఈ ప్రాంగణం కోసం ఖర్చు చేసిన రూ.75 వేలు బూడిదలో పోసిన పన్నీరైంది. ఇది ఒక్క ఏర్గట్ల క్రీడా ప్రాంగణం పరిస్థితే కాదు. జిల్లాలోని అనేక గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాల పరిస్థితి ఇలాగే ఉంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన క్రీడా ప్రాంగణాలను పట్టించుకునేవారు లేక అవి అలంకార ప్రాయంగానే మారిపోయాయి. ఎక్కువ చోట్ల గ్రామానికి దూరంగా ఉండటం, సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో వృథాగా పడి ఉన్నాయి. 2022లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా క్రీడా ప్రాంగణాలను ప్రారంభించారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఒక ఎకరం విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణంను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధి హామీ నిధులతో ఒక్కో ప్రాంగణం కోసం రూ.75 వేల వరకు ఖర్చు చేశారు. క్రీడా సామగ్రి కొనుగోలు కోసం మరో రూ.10 వేలు ఖర్చు చేశారు. గ్రామాలలోని యువత క్రీడల్లో శిక్షణ పొందడం, వ్యాయామం కోసం ఈ ప్రాంగణాలను వినియోగించాలని ప్రభుత్వం నిర్దేశించింది. క్రీడా ప్రాంగణాల స్థల సేకరణలో ఎదురైన ఇబ్బందుల వల్ల ప్రభుత్వ లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపి ఈ క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వానికి విన్నవిస్తాం



క్రీడా ప్రాంగణాలను వినియోగించే విషయంలో ప్రభుత్వానికి విన్నవిస్తాం. యువతీయువకులు ఈ ప్రాంగణాలను వినియోగించుకుని పోలీసు, ఇతరత్రా యూనిఫాం ఉద్యోగాలను దక్కించుకోవాలి. ఎమ్మెల్యేలు, మంత్రులకు విన్నవించి ప్రాంగణాలను ముస్తాబు చేయిస్తాం. – జక్కం అశోక్, కాంగ్రెస్ నేత, మోర్తాడ్

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు


బోధన్ పట్టణంలో వాహనాల తనిఖీ


ఆర్మూర్ పట్టణంలో ..

బోధన్‌టౌన్(బోధన్): పోలీసు, రవాణా శాఖల ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నెంబర్ ప్లేట్ లేని, ఎలాంటి ధ్రువపత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడారు. రవాణా శాఖ నిబంధనలను ప్రతీ ఒక్కరు తప్పని సరిగా పాటించాలని, ద్విచక్ర వాహనానికి నెంబర్ ప్లేట్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు ఉండాలన్నారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వొద్దని, త్రిబుల్ రైడింగ్ చేయరాదని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ తప్పని సరిగా పాటించాలని హెచ్చరించారు. తనిఖీల్లో పట్టుకున్న వాహనాలను ఆర్టీఏ ఆఫీసుకు పంపిస్తామని, అక్కడ జరిమాన కట్టి వాహనాలను తీసుకెళ్లాలన్నారు. సీఐ వీరయ్య, ఎంవీఐ శ్రీనివాస్ రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, ఎంవీఐ ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని, నంబరు ప్లేటు లేని, నంబరును తారుమారు చేసిన వారి వాహనాలను సీజ్ చేశారు. అలాగే పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోలు, ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేశారు. దీంతో పాటు మద్యం సేవించి నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఆర్మూర్ ఎంవీఐ వివేకానంద రెడ్డి, ఎస్‌హెచ్‌వో రవి కుమార్, ట్రాఫిక్ సీఐ రమేష్, సిబ్బంది ఉన్నారు.

ఈదురుగాలుల బీభత్సం



ఎడపల్లి(బోధన్): మండల పరిధిలో ఈదురు గాలులు గురువారం బీభత్సం సృష్టించాయి. బాపునగర్– అలీసాగర్ ప్రధాన రహదారిపై ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి చెట్లు విరిగి ప్రధాన రహదారిపై పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయమేర్పడింది. రోడ్డుపై ఉన్న చెట్లను తొలిగించిన తర్వాత వాహనాలు వెళ్లాయి.

ఇళ్లలోకి మురికి నీరు



నవీపేట: మండల కేంద్రంలో ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మురికి కాలువల్లోని నీరు ఇళ్లలోకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

రాజముద్రపై ధర్మసమాజ్ పార్టీ వినతి


మాక్లూర్ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు


ఆర్మూర్ తహసీల్దార్‌కు..

మాక్లూర్: అన్నివర్గాల ప్రజలను ఆకట్టుకునే విధంగా ధర్మసమాజ్ పార్టీ రాజముద్ర(రాష్ట్ర చిహ్నం)ను రూపొందించిందని, దాన్ని పరిశీలనలోకి తీసుకోవాలని కోరుతూ గురువారం మండల డీఎస్పీ అధ్యక్షుడు సరికెల రమేష్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్‌కు వినతి పత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చిహ్నాన్ని మార్చి కొత్త చిహ్నం తీసుకురావటాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

ఆర్మూర్‌లో..

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర చిహ్నం మార్పును ఆహ్వానిస్తూ డీఎస్పీ రూపొందించిన చిహ్నాన్ని పరిశీలనలోకి తీసుకోవాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రేమ్‌కుమార్ కోరారు. ఆర్మూర్ పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ గజానాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కాన్షీరాం, శ్రీనివాస్, నవీన్, అరుణ్, దినకర్, నవీన్, శ్రీనాథ్, తదితరులున్నారు.

సమాచారం

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

నవీపేట: మండల కేంద్రంలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు ఏడీఈ సుహాసిని గురువారం తెలిపారు. కార్యక్రమానికి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, సభ్యులు కిషన్, రాజాగౌడ్‌లు హాజరవుతారని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలను ఎదుర్కొంటున్న వినియోగదారులు వేదికకు హాజరుకావాలని సూచించారు.

రేపు ఉచిత ఇంజినీరింగ్, మెడికల్ కౌన్సెలింగ్ గైడెన్స్

రుద్రూర్: వేద ఎడ్యుకేషన్స్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని కపిల హోటల్‌లో ఉమ్మడి జిల్లా ఇంటర్ విద్యార్థులకు ఉచిత ఇంజినీరింగ్, మెడికల్ కౌన్సెలింగ్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ విజయ్‌కుమార్ తెలిపారు. రుద్రూర్ మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్, మెడికల్, ఫార్మసీ, నర్సింగ్, అగ్రికల్చర్, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులలో అడ్మిషన్, విదేశాలలో ఎంబీబీఎస్, మాస్టర్ అడ్మిషన్ కోసం అవసరమైన సహకారాన్ని అందిస్తారని తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అడ్మిషన్లు ఉంటాయని వెల్లడించారు. పూర్తి వివరాలకు 73372 32244లో సంప్రదించాలని కోరారు.

ప్రమాదకరంగా గుంత

వేల్పూర్: వేల్పూర్ మండలం జాన్కంపేట్, ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ గ్రామాల మధ్య ఆర్మూర్ భీమ్‌గల్ ఆర్‌అండ్‌బి రహదారిపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. గుంతను గమనించిన జాన్కంపేట్ గ్రామస్తులు ఇతర ప్రయాణికులు ప్రమాదానికి గురికాకుండా ఉండడానికి అక్కడ చెట్టు కొమ్మను అడ్డుగా ఉంచారు. ఆర్మూర్ నుంచి భీమ్‌గల్‌కు గోవింద్‌పేట్, జాన్కంపేట్, పచ్చలనడ్కుడ, చేంగల్, బడాభీమ్‌గల్ గ్రామాల మీదుగా 25 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రహదారి ఉంది. ఈ రహదారిలో నిత్యం వాహనాలు ఆర్మూర్‌కు, భీమ్‌గల్‌కు వేలాదిగా తిరుగుతాయి. గతంలో అదే చోట మధ్యలో రోడ్డు కుంగిపోగా మరమ్మతులు చేశారు. తిరిగి దానిపక్కనే రహదారిపై భారీ గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. పెద్ద వాహనాలు వెళ్తే భారీగా రోడ్డు కుంగిపోయే ప్రమాదం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు వెంటనే గుంతను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.


జాన్కంపేట్, గోవింద్‌పేట్ గ్రామాల మధ్య ఏర్పడిన గుంత

శిఖం భూముల కబ్జాలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న చిక్లీ గ్రామ రైతులు

మాక్లూర్: చెరువుల శిఖం భూములు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నా ఎందుకు పట్టించుకోవటం లేదని చిక్లీ గ్రామ రైతులు గురువారం వీడీసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి ప్రశ్నించారు. శిఖం భూముల కబ్జా విషయమై గతంలో ఒకసారి ఇలాగే వినతి పత్రం ఇచ్చామని, ఈ విషయమై ఇప్పటి వరకు ఎందుకు పట్టించుకోలేదని తహసీల్దార్‌పై మండిపడ్డారు. ఫిర్యాదు అందజేయటం ఇది మూడోసారని, ఈసారి కూడా పట్టించుకోకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తహసీల్దార్‌తో ఖరాఖండిగా చెప్పారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. శిఖం భూములు కబ్జాకు గురికావటం వల్ల చెరువును ఆధారంగా చేసుకుని పంటలు సాగు చేసుకునే నిజమైన రైతులు నష్టపోతున్నారన్నారు. కబ్జా చేసిన శిఖం భూమి నీటిలో మునిగిపోవటంతో కబ్జాదారులు రాత్రి సమయాల్లో దొంగచాటుగా తూములను తెరిచి కబ్జా భూమి తేలే వరకు నీరు ఖాళీ చేస్తున్నారని అలా చేయటం వల్ల నీరు ఉండటం లేదన్నారు. తహసీల్దార్ స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు బూరోల్ల సతీష్, శేఖర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఉన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిపై ఎంపీ ధర్మపురి అర్వింద్ అనుచిత వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఎంపీగా గెలిచినా అర్వింద్ చేసిన అభివృద్ధి ఏమీ లేదని, మత రాజకీయాలు చేసుకుంటూ కాలం వెల్లదీస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితను జైలు నుంచి తీసుకు రావడానికి కేసీఆర్ రాష్ట్రంలోని ఎంపీ సీట్లలో బీజేపీకి మద్దతు ఇచ్చారని విమర్శించారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నియోజకవర్గానికి ఏమీ చేయలేదని ఎంపీ అనడం సరికాదని, గతంలో నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు అలీసాగర్ ఎత్తి పోతల పథకంతో పాటు జలయజ్ఞం పేరిట అనేక ఎత్తిపోతల పథకాలు కట్టి పూర్తి చేశారని గుర్తు చేశారు. గతంలో గెలిచిన ఎంపీ జిల్లాకు చేసింది ఏమి లేదని, ఇప్పుడు గెలిచినా చేసేది ఏమి లేదని, ఇక ముందు ఎమ్మెల్యేను అనుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు పాషా మోయినొద్దిన్, డీసీసీ డెలిగేట్ గంగా శంకర్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావ్, కౌన్సిలర్లు తూము శరత్ రెడ్డి, శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్లం, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ హరికాంత్ చారి, పట్టణ ప్రధాన కార్యదర్శి విష్ణు తదితరులున్నారు.

సకాలంలో యూనిఫాంలను అందించాలి


ముప్కాల్‌లో దుస్తులను ప్రదర్శిస్తున్న మహిళ సమాఖ్య సభ్యులు, ఎంపీడీవో తదితరులు


యూనిఫాంలను అందజేస్తున్న డీఆర్‌డీవో సాయ గౌడ్

బాల్కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలను అందించాలని ముప్కాల్ ఎంపీడీవో ముజాఫరొద్దీన్ అన్నారు. గురువారం స్థానిక మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కుట్టిన యూనిఫాంలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రసాద్‌రావు, మహిళ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

వర్ని(మోస్రా): మండల కేంద్రంలోని బాపనయ్యనగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలను డీఆర్డీవో సాయ గౌడ్ గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న యూనిఫాంలను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. అసిస్టెంట్ పీడీ రవీందర్, డ్వాక్రా ఏపీఎం ముఖీమ్, పాఠశాల చైర్మన్ రేఖ, హెడ్మాస్టర్ లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా చౌడేశ్వరి దేవి శోభాయాత్ర



రుద్రూర్: మండల కేంద్రంలో చౌడేశ్వరి దేవి శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. దేవాంగ సంఘం ఆధ్వర్యంలో ఉదయం ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర ప్రధాన వీధుల మీదుగా మధ్యాహ్నం వరకు కొనసాగింది. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. యువకులు, పెద్దలు సంప్రదాయ దండకాలు వేశారు. అనంతరం ఆలయంలో దేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వరి దేవి నామస్మరణతో ఆలయం మారుమ్రోగింది. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

హన్మాన్ ఆలయ ప్రథమ వార్షికోత్సవం

రుద్రూర్: మల్లయ్య గుట్ట శివారులోని హన్మాన్ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని గురువారం స్థానిక రైతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వందల ఏళ్ల క్రితం నుంచి ఇక్కడ ఉన్న హన్మాన్ విగ్రహానికి పూజలు నిర్వహించేవారని, ఏడాది క్రితం గద్దె నిర్మించి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠ చేసినట్లు రైతులు తెలిపారు. మాజీ సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, సింగిల్ విండో డైరెక్టర్‌లు కర్క అశోక్, వి. రాంరాజ్, రైతులు బుద్దె ఎల్లప్ప, సురాజ్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.



జీలుగ విత్తనాల పంపిణీ



మాక్లూర్: వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు బూరోల్ల అశోక్ ఆధ్వర్యంలో గురువారం మండల వ్యవసాయ అధికారి పద్మ మండలంలోని కల్లెడి, గుత్ప, మాక్లూర్, మాదాపూర్, రాంచంద్రాపల్లి, డీకంపల్లి, చిక్లి, చిన్నాపూర్, అడవి మామిడిపల్లి సబ్ సెంటర్లలో జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. 30 కిలోల జీలుగ విత్తనాల సంచికి ప్రభుత్వ సబ్సిడీపోను రూ:1116కు రైతులకు అందించారు. ఏఈవో ఉమాదేవి, సంఘడైరెక్టర్ మచ్చర్ల రమేష్ రైతులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – లవ్‌బాయ్స్ (తెలుగు) - 11.05, వెపన్ (తెలుగు) - 1.50, భజే వాయువేగం - 4.30, లవ్‌మౌళి (తెలుగు) - 7.25, రక్షణ - 10.30

స్క్రీన్-3 – మనమే (తెలుగు) - 11.45, 3.00, 6.15, 9.30

స్క్రీన్-4 – సత్యభామ - 10.50, 4.50, 10.30, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి - 1.45, బ్యాడ్‌బాయ్స్ - 7.45

విజయవంతంగా బడిబాట కార్యక్రమం


అమ్రాద్‌లో బడి బాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విద్యా శాఖ జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్‌రావు


గోవింద్‌పేట్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


బాల్కొండలో..

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా వ్యాప్తంగా గురువారం ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లల్ని చేర్పించే విధంగా చైతన్యం కల్పించారు. అలాగే గ్రామ పంచాయతీలలో అమ్మ ఆదర్శ కమిటీలతో ప్రమాణం చేయించారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలనే నినాదంతో ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


కుకునూర్‌లో ..


చౌట్‌పల్లిలో..


దూపల్లిలో..